# దైవం మనుష్య రూపేణా

"ఓ అర్జునా! బాగుగా ప్రజ్వలింపజేయబడిన అగ్ని కట్టెలను ఏ ప్రకారము బూడిదగా చేయునో ఆ ప్రకారమే జ్ఞానమగు అగ్ని...."

"అయ్యగారూ! బామ్మగారు రమ్మంటున్నారు" పనిమనిషి పిలుపుతో చదువుతున్న 'గీతా



మకరందం' పక్కన పెట్టి ఉత్తరపు గదిలోకి వెళ్ళాను. నా అలికిడికి మంచంలో ఉన్న అమ్మ మెల్లగా కళ్ళు తెరిచింది.

"ఒరేయ్ పెద్దోడా! మీ అన్నదమ్ముల పిల్లలకి గాని, నీ చెల్లెలు సంతానానికి గానీ 'మల్లికార్జున' పేరు పెట్టలేదు. కనీసం వాళ్లకి పుట్టిన నా మునిమనవళ్లకైనా వాడి పేరు పెడితే బాగుంటుందేమో ఆలోచించరా" ఎండిపోయిన ఆమె గాజు కళ్ల నుంచి రెండు కన్నీటి బొట్లు ముడతలు పడ్డ చెంపలపై జారాయి.

ఉలిక్కిపడ్డాను. నా గుండె లోపలి పొరలలో ఏదో అలజడి. ఎప్పటి మల్లికార్జున? దాదాపు యాభై ఐదు సంవత్సరాల క్రితం జరిగినది అమ్మ ఇంకా మరచిపోలేదన్నమాట. మల్లిగాడి జ్ఞాపకాలు ఈమెలో ఇంకా చెరిగిపోలేదు. అలాగే వున్నాయి. కేవలం పదకొండు సంవత్స





రాల అనుబంధం ఇంతలా పెనవేసుకుని ఉంటుందా? కళ్ల ముందున్న మా మీద కంటే వాడిమీద ఎందుకంత మమకారం?

"అమ్మా! ఇప్పుడు అవన్నీ ఆలోచించి మనసు పాడుచేసుకోకు. హాయిగా కళ్లు మూసుకొని కృష్ణా... రామా... అనుకుంటూ ప్రశాంతంగా పడుకో" గట్టిగానే కసిరి, గదిలోంచి బయటికొచ్చాను.

మళ్లీ పుస్తకం తెరిచానే గానీ అక్షరాలకి బదులు మల్లిగాడి రూపం లీలగా కనిపించ సాగింది. చిన్ననాటి స్మృతులు నెమ్మదిగా గుర్తుకొస్తున్నాయి.

★ ★ ★

"ఊ...ఊ... అమ్మా... అన్నయ్య కంచంలో ఏమో ఎక్కువ పెరుగు వడ్డించావు. నాకేమో కొంచెమే వేసావ్" భోజనాల వద్ద మల్లిగాడి ఫిర్యాదుకి నాకు కోపం తన్నుకొచ్చింది. అమ్మ ఏదో సర్దిచెప్పింది కాబట్టి అప్పటికి తమాయించుకున్నాను. ఆ సాయంకాలం ఆటలాడేటప్పుడు ఏదో నెపంతో గడ్డివాము చాటున వాడి వీపు మీద నాలుగు పిడి గుద్దులు గుద్ది కసి తీర్చుకున్నాను. "అమ్మకి చెబుతానుండు" అని పెద్దగా వెక్కిళ్ళుపెట్టి వాడు ఏడుస్తూంటే పట్టించుకోలేదు. ఒకవేళ అమ్మకి చెప్పినా 'పెద్ద కొడుకునని, నాన్నగారి గారాల పట్టిననీ' ఆమె ఏమంత ఖాతరు చేయదు. పైగా "అన్నయ్యతో నీకు పోటీ ఏమిటి?" అని వాడినే మెత్తగా మందలించేది. ఆ అలుసుతో క్రమేణా మల్లిగాడు నా ముందు సింహాన్ని చూసిన కుందేలులా వణికిపోయేవాడు.

★ ★ ★

పిల్లలను ప్రేమించే నాకు నా తరువాత పుట్టిన మల్లిగాడంటే ఎందుకో ద్వేషం, అయిష్టత. అవి వాడు పుట్టక మునుపే నాలో పుట్టాయేమో! తాను కడుపులో పడ్డాక నేను తల్లి ఒడికి దూరం కావడం, నెలలు నిండిన అమ్మ ముక్కుతూ మూలుగుతూ పడే అవస్థ ప్రత్యక్షంగా చూడడం కారణాలు కావచ్చు.

"ఆ పుట్టబోయేది ఆడో మగో కానీ అసాధ్యపు పిండంలా ఉంది. పుట్టకముందే నిన్నింతలా వేపుకు తింటోందే, ఇక పుట్టాక ఇంకెన్ని తిప్పలు పెడుతుందో" అంటున్న అమ్మలక్కల మూతి విరుపు మాటలు కూడా వాటికి దోహదం చేసి ఉండవచ్చు. ఊరి పెద్దాసుపత్రిలో ప్రసవ వేదనతో అమ్మ అరిచే అరుపులు ఆగాక "నీకు తమ్ముడు పుట్టాడు" అని ఆ రాత్రి పిన్ని నాతో చెప్పినప్పుడే వాడి మీద శత్రుత్వానికి అంకురార్పణ జరిగి ఉండవచ్చు.

★ ★ ★

అయిదుగురి జన్మకి కారణమయ్యాక తన జన్మ సార్థకమైందని అనుకున్నారేమో నాన్నగారు నడివయసులోనే తనువు చాలించారు. అప్పుడు నాకు పదకొండేళ్ళు. ఆఖరి తమ్ముడు అమ్మపాలు తాగుతున్న ఏడాది బిడ్డ.

ఆర్జనాపరుడు లేడు, ఆదాయం రాదు. అత్యవసర ఖర్చులకి చేసిన అప్పుల భారంతో కౌలుకిచ్చిన మాగాణిలో పండే పంట ఇంటికి చేరడం లేదు. ఏడాదికొక ఎకరం చొప్పున నాలుగెకరాలూ పరులపాలయ్యాయి. పాలిచ్చే పశువులు సంతకి వెళ్ళాయి. ఇంటి కుక్క కూడా పొరుగింటికి అలవాటు పడిన దుస్థితి.

"కొండమ్మా... ఇంతమంది పిల్లల్ని నువ్వు సాకలేవు గానీ ఒకడిని దత్తత ఇచ్చేయరాదూ" పక్కింటావిడ చేసిన సూచనకి అమ్మ ఒప్పుకోలేదు. "నా బిడ్డల్లో నేనెవరినీ వదులుకోలేను. కాయకష్టం చేసైనా వాళ్ళని పెంచుతాను" ఉక్రో

మేడా మస్తాన్‌రెడ్డి

షంతో బదులిచ్చింది.

ఒక రోజు మార్కాపురం మామయ్య వచ్చి "అక్కయ్యా... టౌనులో కొత్తగా హాస్టలు పెట్టారు. పేదపిల్లల్ని చేర్చుకుని, అన్ని వసతులూ సమకూరుస్తున్నారట. పుస్తకాలు కూడా ఉచితమేనట. మీ పెద్దబ్బాయిని చేర్చరాదూ " అంటూ కూర్చున్నాడు.

ఆవేళ అమ్మ ఎందుకనో కాస్త మెత్తబడింది. "మగదిక్కులేని సంసారం. పెద్దోడు అన్నింటికీ చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. మల్లికార్జునని చేర్పిస్తే బాగుంటుంది. కానీ... వాడిని చూడకుండా ఉండలేను తమ్ముడూ."

"వాడినేమన్నా ఓడలో లండను పంపుతున్నామా చెప్పు అక్కయ్యా? యాభై మైళ్లలోపే ఉన్న పట్టణానికే కదా! ఒకరి భారం తగ్గినా నీకు మేలే. అదీగాక మనుషులు దూరమైతే కాట్లాడుకునే అన్నదమ్ములిద్దరిలోనూ ప్రేమ పెరుగుతుంది కూడానూ. నా మాట వినూ" మామయ్య పట్టిన పట్టు వదల్లేదు.


"సరే! నీ ఇష్టం" అంది అయిష్టంగానే అమ్మ. ఊరి చివర బస్సు ఆగే చోట మల్లిగాడు చేసిన అల్లరి, మారాం అంతా ఇంతా కాదు." అమ్మా నేను వెళ్లనే... అక్కడ నేను చదువుకోను. నీతోటే ఉంటానమ్మా. నన్ను పంపకే" ప్రాధేయ పడుతూ అమ్మ మోకాళ్లని గట్టిగా చుట్టేసాడు. ఇంతలో బస్సు వచ్చి ఆగింది.

అమ్మ గుడ్ల నీరు పైట కొంగుతో ఒత్తుకుని గింజుకుంటున్న మల్లిగాడిని మామయ్యతో బలవంతంగా బస్సు ఎక్కించింది. నేను చిన్న ట్రంకుపెట్టెను లోపలికి అందించడమూ, మా కళ్లల్లో దుమ్ము కొట్టి బస్సు వెళ్లిపోవడమూ క్షణాల్లో జరిగిపోయాయి.

అమ్మ మల్లిగాడిని తలవని క్షణం లేదు. మూడు నెలలు గడిచాయో లేదో ఒకనాటి ఉద



ప్రముఖ రచయిత్రి డా॥ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి రచించిన 'ఆలకించే అక్షరం' సంకలనాన్ని హైదరాబాద్‌లో ఆవిష్కరించినప్పటి దృశ్యం. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ టి. కృష్ణారెడ్డి, ప్రముఖ రచయిత్రి డా॥ సుజాతారెడ్డి, డా॥ జయప్రద, నల్గొండ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శ్రీ కె. ముత్యంరెడ్డి, డా॥ ఎన్. గోపి ఫొటోలో ఉన్నారు.




యం ఏడుపులతో కూడిన పెడబొబ్బలతో నిద్ర లేచాను. వాకిట్లో తెల్లని కారు ఆగి ఉంది. వరండాలోని బెంచీపై నిద్రపోతున్నట్లున్న మల్లిగాడి మీద పడి అమ్మ పిచ్చిదానిలా రోదిస్తూ ఉంది. పక్కన మామయ్య నిలబడి ఉన్నాడు. కామెర్లు వచ్చి పత్యం లేక ప్రాణం పోయిందని ఎవరో అంటున్నారు. భూమికి రెండు అడుగుల ఎత్తుకి ఎగిరి పడుతూ ఏడ్చే అమ్మని సముదాయించడం ఎవరికీ సాధ్యం కాలేదు.

మా చిన్నాన్న చేతుల మీదుగా నా కళ్లముందే మల్లిగాడు మట్టిలో కలిసిపోయాడు. ట్రంకు పెట్టెలోని వాడి బట్టలు, పుస్తకాలూ చూసి అమ్మ బావురుమంది. ఆ పెట్టె అడుగున కనిపించిన కాగితం తీసి చదివి నెత్తీ నోరూ కొట్టుకుంటూ సొమ్మసిల్లి పడిపోయింది. తమ్ముళ్లు, చెల్లాయి బిక్కమొహంతో బిక్కుబిక్కుమంటూ నన్ను గట్టిగా పట్టుకున్నారు.

అన్ని గాయాలకూ కాలమే మందు. ఎన్నో కష్టాలకోర్చి మమ్మల్నందరినీ ప్రయోజకులుగా తీర్చిదిద్ది, పెళ్లిళ్లు కూడా చేసింది మా అమ్మ కొండమ్మ.

★ ★ ★

చనిపోయినవారి ఫొటో "దేవుని గదిలో ఉంటే ఇంటికి అరిష్టమట. మన పిల్లలు కూడా అర్ధాయుష్కులౌతారట" అంటూ నా సహధర్మచారిణి ఒక రాత్రి గొణిగింది. కాబోలు అనుకుని ముద్దులొలికే చిన్నప్పటి మల్లిగాడి ఫొటో తీసి పెట్టెలో పడేసాను. ఆ తరువాత ఇల్లు మారినప్పుడు, స్వంత ఇంటిలో స్థిరపడినప్పుడూ దాని ధ్యాసే లేదు.

"ఒరేయ్ పెద్దోడా! అటుచూడు, ఎర్రగా బుర్రగా గుండ్రని ముఖంతో కళకళలాడుతున్న ఆ కుర్రాడ్ని చూసావా? మన మల్లికార్జునలా లేదూ...!"

పది పన్నెండేళ్ల ఏ పిల్లవాడు కనిపించినా అమ్మ నోటంట ఇలాంటి మాటలు కొన్నేళ్లు వస్తూ ఉండేవి.

"నీది మరీ చాదస్తమమ్మా. మేమింత మం

దిమి ఉన్నాం. మాకింత మంది కలిగారు. ఇంకా మల్లిగాడిని మరిచిపోలేదా?" అని మందలించే వాడిని. తమ్ముడి ఊసు మరిచిపోయిందో లేక నా ఎదుట వాడి ప్రస్తావన తేకూడదనుకుందో క్రమంగా మా ఇద్దరి మధ్యా వాడు మరుగున పడిపోయాడు.

మళ్లీ ఇన్నేళ్లకి అమ్మనోట వాడి పేరు విని పించింది. ఆ చేదు జ్ఞాపకాలతో ఏ అర్ధరాత్రికో మగత నిద్రపట్టింది.

తెల్లవారుజామున నన్ను కుదుపుతూ "డాడీ..డాడీ.. నానమ్మ" అన్న చిన్న కొడుకు అరుపులతో అదిరిపడి నిద్రలేచాను. పరుగులాంటి నడకతో అమ్మగది చేరాను. ఎప్పుడో సహస్ర చంద్ర దర్శనం చేసుకున్న అమ్మ ఇప్పుడు సూర్యోదయానికి ముందే కన్నుమూసింది. కబురు తెలిసి బంధుగణం అంతా కదిలి వచ్చారు.

తను కన్నవారికే గాక, వాళ్లు కన్నవాళ్లకి, వారిబిడ్డలకీ కూడా లాల పోసిన అమ్మకి చివరి స్నానం చేయిస్తున్నారు. జీవితంలోని ఏ ఒడిదుడుకులకూ చలించని అమ్మ చలనం లేకుండా నిర్మలంగా నిద్రపోతున్నట్లే ఉంది.

పార్థివకాయాన్ని పాడె మీదకి మారుస్తున్నారు. నా కళ్లు హఠాత్తుగా తడిచిన అమ్మ రవిక లోపల దాచుకున్న కాగితంపై పడ్డాయి. నా కను సైగతో నా కోడలు దానిని బయటకు తీసి నా చేతికి ఇచ్చింది. ఆశ్చర్యంతో మడతవిప్పి చూసాను. అది ఒకటి కాదు, రెండు. లిప్తపాటుకాలం బుర్ర పనిచేయలేదు. వాటిలో ఒకటి క్షీణదశలో ఉన్న చిన్ననాటి మల్లిగాడి ఫొటో. రెండోది జీర్ణావస్థలో ఉన్న నోట్సు పుస్తకంలోని కాగితం. ఆ కాగితం ఆనాడు వాడు అమ్మకి రాసి ఉంచిన ఉత్తరం. ఫొటో జేబులో పెట్టుకుని, ఓ మూలకి చేరాను. అలుక్కుపోయి ఉన్న ఆ కాగితంలోని అక్షరాలను కూడ బలుక్కుంటూ ఎంతో ప్రయాసతో చదవగలిగాను.

"ప్రియమైన అమ్మకి మల్లికార్జున వ్రాయునది. అమ్మా...! నేనీ హాస్టలులో ఉండలేకపోతున్నాను. నిన్ను చూడాలని ఉంది. అన్నయ్యతో ఇంకెప్పుడూ పోట్లాడను. కొట్టినా ఏడవను. నువ్వు ఏది పెడితే అది తింటాను. తమ్ముళ్లని, చెల్లాయినీ ఎత్తుకుని ఆడిస్తాను. రాత్రిళ్లు మీరంతా గుర్తుకొస్తున్నారు. ఏడుపు వస్తోంది. నన్ను వెంటనే తీసుకువెళ్లమని మామయ్యతో చెప్పు.

ఇట్లు, నీ రెండవ కుమారుడు

నా రెండు కళ్లూ జలపాతాలయ్యాయి. ఆనాటి నా తమ్ముని చావుకి పరోక్షంగా నేనుకూడా ఒక కారణమని తెలిసి నా ముఖం చిన్నబోయింది. అప్పుడెప్పుడో నాన్నగారు పోయినప్పుడు, ఆ తరువాత మల్లిగాడు శవమై వచ్చినప్పుడు, ఇప్పుడు అమ్మ నిర్జీవమై ఎదురుగా ఉన్నప్పుడూ ఏడుపురాలేదు. పశ్చాత్తాపంతో గుండె బరువెక్కింది. దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. అమ్మ గుండెల్లో ఇన్నేళ్లుగా దాచుకున్న బడబాగ్నిని తలచుకుని కుమిలి కుమిలి ఏడ్చాను.

తల్లి పోయినందుకేమోనని కొడుకులు, కోడళ్లూ ఓదార్చారు. ఇంతలో జరగవలసిన కార్యాన్ని గుర్తుచేస్తూ జంగం దేవర శంఖం ఊది గంట ఆడించాడు.

"ఒక మృతశిశువుని ప్రసవించిన మాతృమూర్తి తాను మృత్యులోగిలిలోకి వెళ్లేంతవరకూ ఆ కడుపు కోతను, గర్భశోకాన్నీ మరచిపోలేదు..."

కన్నతల్లి ప్రేమ గొప్పదనాన్ని గురించి నా చిన్ననాట విన్న 'హరిదాసు' మాటలు చెవిలో మారుమ్రోగుతుండగా అమరపురికేగిన దైవంలాంటి అమ్మ ముందు సిగ్గుతో తలదించుకుని శ్మశానంవైపు అడుగులు వేసాను. ●